## క్లుప్తంగా

### నవగ్రహాల ప్రతిష్టాపనకు రూ.1.50లక్షల విరాళం

రామగిరి(నల్లగొండ) : శివరాత్రి పండుగ సందర్భంగా ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి శనివారం తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం భక్త మార్కేండేయస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో నవ గ్రహాల ప్రతిష్టాపనకు రూ.1.50లక్షల ఆర్థికసాయం ప్రకటించారు. ఈమేరకు తక్షణమే రూ.50 వేలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఆయన వెంట నాయకులు బద్దం సుధీర్, ప్రశాంత్, జూకూరి రమేష్, ఎంపీటీసీ పల్లె ఎల్లయ్య, మట్టయ్య, వనపర్తి అంజయ్య తదితరులు ఉన్నారు.

### ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : నకిరేకల్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో శనివారం టీపీసీసీ నేత దైద రవీందర్ పూజలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ.10,116లు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంచర్ల బ్రహ్మచారి, యూత్ అధ్యక్షుడు ముద్దం విజయ్, నరేంద్రాచారి పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరిక

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తెలిపారు. శనివారం కట్టంగూర్ మండలంలోని అయిటిపాముల గ్రామానికి చెందిన ఎంపీటీసీ-1 బెల్లి మహాలక్ష్మీసుధాకర్‌తో పాటు వార్డు సభ్యులు, పలు పార్టీల నాయకులు నార్కట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తరాల బలరాములు, వైస్‌ఎంపీపీ గడుసు కోటిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏడుకొండలు, పీఏసీఎస్ చైర్మన్ నూక సైదులు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పోగుల నర్సింహ, చెవుగోని నాగరాజు, బెల్లి రవి, కొమ్ము తదితరులు కోటేష్ ఉన్నారు.

### రైతుల పాలిట దగా పోర్టల్‌గా మారిన ధరణి


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న చల్లమల్ల కృష్ణారెడ్డి

మర్రిగూడ: రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి రైతుల పాలిట దగా పోర్టల్‌గా మారిందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లమల్ల కృష్ణారెడ్డి అన్నారు. శనివారం మర్రిగూడ మండలం మేటిచందాపురం పరిధిలోని ఇందుర్తిలో శ్రీ శంభులింగేశ్వరస్వామి కల్యాణోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన పలు పార్టీల కార్యకర్తలు ఏరుకొండ రాము ఆధ్వర్యంలో చల్లమల్ల కృష్ణారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ప్రతి గడపకు వెళ్లి 45 రోజుల్లో ప్రజా సమస్యలను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో మునుగోడు గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దామెర జీవన్, గిరి యాదయ్య, చేపూరి శ్రీను, నర్సింహ, అంజయ్య, మేతరి గిరి, శంకర్, సైదులు, అబ్బయ్య, గుయ్యని లింగయ్య, కృష్ణ, లపంగి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### ఏకాగ్రతతో చదవాలి


పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న క్లబ్ ప్రతినిధులు

శాలిగౌరారం: విద్యార్థులు ఏకాగ్రతతో విద్యనభ్యసించాలని లయన్స్ క్లబ్ జిల్లా ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్, చెస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ గండూరి కృపాకర్ అన్నారు. గురుజాల మాజీ సర్పంచ్ మారం వేణుగోపాల్‌రెడ్డి తన కుమారుడు పవన్‌కుమార్‌రెడ్డి జ్ఞాపకార్థం శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. అదేవిధంగా విద్యాలయానికి చెందిన విద్యార్థిని కోలాట బృందానికి తనవంతుగా డ్రెస్‌కోడ్ చీరలు అందజేస్తానని ప్రకటించారు. అనంతరం మండల కేంద్రంలో లయన్స్‌క్లబ్ కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ ఎర్ర శంభులింగారెడ్డి, దేవరశెట్టి శ్రీనివాసులు, బాణాల రాంరెడ్డి, శాలిగౌరారం క్లబ్ అధ్యక్షుడు బుడిగె శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి దునుక వెంకన్న, ప్రతినిధులు వెంకటాచారి, మహేందర్‌రెడ్డి, ఆంజనేయులు, అశోకాచారి, వేణుగోపాల్‌రెడ్డి, వెంకటరామశర్మ, సుబ్రమణ్యశర్మ, రామ్మూర్తి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# హరహర మహాదేవ..

- వైభవంగా మహాశివరాత్రి ఉత్సవాలు
- శివనామ స్మరణతో మార్మోగిన ఆలయాలు

రామగిరి(నల్లగొండ) : మహా శివరాత్రిని పురస్కరించుకుని శనివారం శివనామ స్మరణలతో ఆలయాలు హోరెత్తాయి. నల్లగొండ పట్టణంలోని పానగల్లు ఛాయా సోమేశ్వరాలయం, పచ్చల సోమేశ్వరాలయాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో న్యూస్ పాఠశాల విద్యార్థులు వేసిన కోలాట నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

**తిప్పర్తిలో శివరాత్రి వేడుకలు..**

తిప్పర్తి మండలంలోని రామలింగాలగూడెం భక్త మార్కేండేయస్వామి ఆలయంలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

**శివుడికి ఎంపీ ప్రత్యేక పూజలు**

నల్లగొండ పట్టణంలోని పానగల్లు ఛాయా పచ్చల సోమేశ్వరాలయాలను ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దర్శించుకున్నారు. శివుడికి అభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం ఛాయా సోమేశ్వరాలయంలో విద్యార్థులతో కలిసి కోలాటం వేశారు.

**పానగల్లు ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాల్లో ఎమ్మెల్యే పూజలు**

ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పానగల్లు ఛాయా, పచ్చల సోమేశ్వరాలయాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పచ్చల సోమేశ్వరాలయంలో అభివృద్ధి పనులు ప్రారంభించారు. రూ.10 కోట్ల నిధులతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్ ఉన్నారు.


గట్టుప్పల మండల కేంద్రంలోని శివాలయంలో నిర్వహించిన కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

**చాడ కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు...**

బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చాడ కిషన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణాచారి పానగల్లు పచ్చల సోమేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

**కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో..**

నల్లగొండ పట్టణంలోని లోని పాతబస్తీ బ్రహ్మంగారి గుట్టపై ఉన్న పార్వతీ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

**విగ్రహ ప్రతిష్ఠాపన**

కేతేపల్లి : మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో శ్రీ శంభులింగేశ్వర, సీతారామచంద్రస్వామి ఆలయాల్లో శనివారం విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌లు వేర్వేరుగా పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

**కేతేపల్లిలో..**

కేతేపల్లి: శివరాత్రి సందర్భంగా శనివారం కేతేపల్లి మండలంలోని కేతేపల్లి, ఇనుపాముల, గుడివాడ, భీమారం గ్రామాల్లో శివాలయాల్లో అభిషేకాలు, గోత్ర నామాల పూజలు నిర్వహించారు. ఇనుపాముల శివాలయంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పూజలు చేశారు. ఆయా వేడుకల్లో సర్పంచులు బడుగుల శ్రీనివాస్‌యాదవ్, జాల వెంకట్‌రెడ్డి, కట్ట శ్రవణ్, శివాలయ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.

**చిత్తలూరులో మాజీ ఎంపీ పూజలు**

శాలిగౌరారం: మాజీ ఎంపీ, బీజేపీ రాష్ట్ర నాయకుడు బూర నర్సయ్యగౌడ్ శనివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శాలిగౌరారం మండలంలోని చిత్తలూరు గ్రామంలో ఉన్న శ్రీశాంభవి శంభులింగేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

**శివ పార్వతుల కల్యాణోత్సవం.**

చిట్యాల: చిట్యాల పట్టణంలోని శివాలయం, ఉరుమడ్ల గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, వెలిమినేడు గ్రామంలో శంభులింగేశ్వర స్వామి ఆలయం, గుండ్రాంపల్లి గ్రామంలోని శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో పార్వతీ పరమేశ్వర కల్యాణోత్సవం జరిపించారు.


పచ్చల సోమేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి

### భక్తులతో కిక్కిరిసిన చెర్వుగట్టు దేవాలయం

నార్కట్‌పల్లి : చెర్వుగట్టులోని శ్రీపార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవాలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. ఆలయంలో ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఉండేందుకు ఆలయ అధికారి నవీన్‌కుమార్ ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లి గ్రామంలోని జలరామలింగేశ్వరస్వామి దేవాలయాన్ని జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


ఛాయాసోమేశ్వరాలయంలో వాయినాలు ఇచ్చుకుంటున్న మహిళలు


చండూరు మండలం తుమ్మలపల్లిలోని రామలింగేశ్వరాలయంలో భక్తులు


పచ్చల సోమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న చాడ కిషన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రమణాచారి


శివుడి విగ్రహానికి మొక్కుతున్న భక్తులు


పానగల్‌లోని ఛాయా సోమేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


నల్లగొండ పట్టణంలోని బీటీఎస్ దుర్గాకాలనీలో శివలింగానికి మొక్కుతున్న భక్తులు


నల్లగొండలోని భక్త మార్కేండేయ స్వామి ఆలయంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్న గుత్తా సుఖేందర్‌రెడ్డి, పాశం రాంరెడ్డి తదితరులు


శాలిగౌరారం : చిత్తలూరు శాంభవి శంభులింగేశ్వరాలయంలో భక్తులు


నకిరేకల్‌లోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో దర్శనం కోసం భక్తుల బారులు


శాలిగౌరారం : పూజలు చేస్తున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్


పచ్చల సోమేశ్వరాలయంలో శివలింగానికి అభిషేకం నిర్వహిస్తున్న టీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు పిల్లి రామరాజు


నార్కట్‌పల్లి : జలరామలింగేశ్వరాలయంలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి


చెర్కుపల్లిలో ప్రతిష్ఠించిన ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

### ఛాయా సోమేశ్వరాలయంలో వైభవంగా స్వామివారి కల్యాణం

నల్లగొండ పట్టణంలోని పానగల్ ఛాయా సోమేశ్వరాలయంలో శనివారం స్వామివారి కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆయన సతీమణి రమాదేవి, ఆడియో జయచంద్రారెడ్డి దంపతులు, డీఎస్పీ నర్సింహారెడ్డి దంపతులు, ఆలయ కమిటీ చైర్మన్ దంపతులు పాల్గొన్నారు.



### ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు

రామగిరి(నల్లగొండ) : శివరాత్రి సందర్భంగా పానగల్లు, ఛాయా సోమేశ్వరాలయాలకు వెళ్లే వృద్ధులు, మహిళలు, పిల్లల కోసం ట్రస్మా ఆధ్వర్యంలో నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్ నుంచి పానగల్లు వరకు శనివారం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రస్మా నాయకుడు గంట్ల అనంతరెడ్డి మాట్లాడుతూ బస్సు సౌకర్యానికి సహకరించిన యానాల ప్రభాకర్‌రెడ్డి, ముకాకముల నరసింహ, భిక్షం, రవీందర్, పాముల అశోక్, జీవి.రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

### పాదయాత్రకు తరలిరావాలి


మాట్లాడుతున్న ఏర్పుల యాదయ్య

మర్రిగూడ: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈనెల 20న జిల్లా కేంద్రంలో నిర్వహించే పాదయాత్రకు కార్మికులు తరలిరావాలని ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యుడు ఏర్పుల యాదయ్య కోరారు. శనివారం మర్రిగూడ మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అందించాలని, మల్టీపర్పస్ విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. సమావేశంలో వట్టిపల్లి హనుమంతు, ఉరిపక్క లింగయ్య, పెరుమాళ్ల మంజుల, తిప్పర్తి లింగయ్య, సునీత తదితరులు పాల్గొన్నారు.

### ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

మునుగోడు: మండలంలోని గుండ్లోరిగూడెంలో చేపట్టిన మల్లన్న దేవాలయ నిర్మాణ పనులను బీజేపీ రాష్ట్ర నాయకుడు వేమిరెడ్డి సురేందర్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ఆ గ్రామానికి చెందిన బొల్లం భిక్షమయ్య ఆలయానికి మూడు గుంటల భూమిని ఉచితంగా ఇచ్చారని.. గుడి నిర్మాణానికి అవసరమైన నగదును మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అందించనున్నారని సురేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల భిక్షం గౌడ్, నాయకులు బూడిద లింగయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ జిట్టగోని యాదగిరి, పందుల భాస్కర్, పందుల మల్లేష్, బేరి క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

### పురావస్తు శాఖ ఏడీ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

నల్లగొండ : పానగల్లు మ్యూజియం ఆవరణలో రాష్ట్ర పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయం ఏర్పాటు చేయాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి, పురావస్తు, పర్యాటక శాఖ మంత్రులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు.

### శంభులింగేశ్వరాలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

శాలిగౌరారం: మండలంలోని వల్లాల గ్రామంలో ఉన్న శ్రీపార్వతీశంభులింగేశ్వర దేవాలయ బ్రహ్మోత్సవాలు శనివారం మహాశివరాత్రి పర్వదినం రోజున ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 26 వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం ఉదయం మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అంకురారోపణం, ధ్వజారోహణం, నిర్వహించారు. ఆదివారం శ్రీపార్వతీశంభులింగేశ్వర కల్యాణం, స్వామివారికి తలంబ్రాలు, స్వామివారి ఊరేగింపు, హోమాలు, లింగార్చన, బలిహరణం, సోమవారం సాయంత్రం రథోత్సవం, మంగళవారం నిత్యపూజలు, నవగ్రహహోమం, మూలమంత్రహోమం, పూర్ణాహుతి, బుధవారం రుద్రాభిషేకాలు, రాత్రి గజవాహనసేవ, గురువారం నిత్యపూజలు, అశ్వవాహనసేవ, శుక్రవారం శ్రీలలిత సహస్రనామార్చన, 25న(శనివారం) నిత్యపూజలు, అభిషేకాలు, శ్రీఆంజనేయస్వామి దేవాలయంలో మన్యుసూక్త పారాయణం, 26న త్రిశూల స్నానం, ఏకాంత సేవ నిర్వహించనున్నారు.

# పేద ప్రజలకు అండగా ఉంటా

- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

శాలిగౌరారం: పేద ప్రజలకు అండగా ఉంటానని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి శాలిగౌరారం మండలంలోని ఇటుకులపహాడ్, చిత్తలూరు, అంబారిపేట, వల్లాల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇటుకులపహాడ్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు సుమారు 4 కిలోమీటర్ల మేర ర్యాలీ నిర్వహించి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నూతనంగా నిర్మించిన శివాలయంలో ఎంపీ పూజలు చేశారు. గత సంవత్సరం గుండెపోటుతో మృతిచెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కొండూరు నాగరాజు కుటుంబసభ్యులను పరామర్శించి రూ.1.30 లక్షల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం రాత్రి చిత్తలూరు గ్రామంలో పర్యటించి, శ్రీశాంభవి శంభులింగేశ్వర దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ అభివృద్ధికి రూ. 5లక్షలు విరాళాన్ని ప్రకటించారు. అంబారిపేటలో నిర్వహించిన కార్యకర్తల సమీక్ష సమావేశంలో పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని వల్లాల గ్రామంలోని శ్రీపార్వతీశంభులింగేశ్వర దేవాలయంలో పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న కనకదుర్గ దేవాలయానికి రూ.2 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు వడ్డెపల్లి రవి, దైద రవీందర్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు అల్లి సైదులు, పాదూరి శంకర్‌రెడ్డి, కందాల సమరంరెడ్డి, షేక్ ఇంతియాజ్, రవీందర్‌రెడ్డి, రవి, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


వల్లాలలోని శివాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


ఇటుకులపహాడ్‌లో నాగరాజు కుటుంబసభ్యులతో మాట్లాడుతున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

# రోడ్డు దాటాలంటే భయం

- రాంరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట లేని స్పీడ్ బ్రేకర్లు
- ప్రమాదాలు జరిగే అవకాశం


రాంరెడ్డిపల్లిలో ఉపాధ్యాయుల సాయంతో రోడ్డు దాటుతున్న విద్యార్థులు

మర్రిగూడ: మండలంలోని రాంరెడ్డిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట ఎలాంటి స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో విద్యార్థులు రోడ్డుదాటేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో 1 నుంచి 6వ తరగతి వరకు 80 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఈ రోడ్డుకు సమీపంలోనే ఆటోస్టాండ్ ఉంటుంది. ఈ రహదారి మీదుగా బస్సులు, మాల్ నుంచి వచ్చే వాహనాలు అత్యంత వేగంతో వెళ్తుంటాయి. అంతేకాకుండా మర్రిగూడ నుంచి వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. స్పీడ్ బ్రేకర్లు లేకపోవడం, ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడంతో సాయంత్రం వేళల్లో విద్యార్థులు రోడ్డు దాటలేని పరిస్థితి నెలకొంటుంది. అదేవిధంగా యరగండ్లపల్లి గ్రామంలో ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట కూడా స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో విద్యార్థులు రోడ్డు దాటే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

**విద్యార్థులను రోడ్డు దాటిస్తున్న ఉపాధ్యాయులు**

వాహనాల వేగాన్ని అదుపు చేసేందుకు యరగండ్లపల్లిలో రూ.20వేలతో రెండు బారికేడ్లను పాఠశాల నిర్వాహకులు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో గుర్తు తెలియని వాహనాలు ఆ బారికేడ్లకు తగలడంతో అవి దెబ్బతిన్నాయి. దీంతో పాఠశాలకు నాలుగు బారికేడ్లను సర్పంచ్ మునగాల సుధాకర్ రావు జీపీ నిధుల నుంచి, మరో రెండింటిని పోలీసు వారు అందించారు. వాటి సాయంతోనే ఉపాధ్యాయులు సాయంత్రం సమయంలో విద్యార్థులను రోడ్డు దాటిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రహదారిపై స్పీడ్ బ్రేకర్ల నిర్మాణం చేపట్టాలని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

### నిత్యం భయంగా ఉంటుంది



పాఠశాలకు వెళ్లి రావడంతోపాటు బయటికి వెళ్లాలంటే, రోడ్డును దాటాలంటే భయంగా ఉంటుంది. వాహనాలు అతివేగంగా వస్తుంటాయి. ఆటలు ఆడుకునేందుకు సాయంత్రం వేళల్లో రోడ్డును దాటాలంటే కష్టంగా మారింది. వాహనాల వేగాన్ని తగ్గించేలా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి.

– ప్రభాస్, రాంరెడ్డిపల్లి, 6వ తరగతి విద్యార్థి

### స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి



పాఠశాల ఎదుట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేయాలి. నిత్యం బడికి పిల్లలను పంపించాలంటే భయమేస్తుంది. అధికారులు విద్యార్థులకు రక్షణ కల్పించాలి. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక వసతులు ఉంటాయనుకుంటే కనీసం భద్రత లేకుండా పోతుంది. స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటుచేసి వాహనాల వేగాన్ని నియంత్రించాలి.

– వడ్డె శివకుమార్, రాంరెడ్డిపల్లి, విద్యార్థి తండ్రి

### ప్యాచ్ వర్క్ చేసేటప్పుడు స్పీడ్ బ్రేకర్లు వేయిస్తాం

పాఠశాల వద్ద స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని నా దృష్టికి వచ్చింది. ఆ సమయంలో అనుమతులు రాలేదు. ప్యాచ్ వర్క్ చేసేటప్పుడు స్పీడ్ బ్రేకర్లను వేయిస్తాం. అనుమతులు లేకుండా గ్రామస్తులు ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్లు వేయొద్దు. విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని నిబంధనల మేరకు త్వరలోనే స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేస్తాం.

– అనిత, ఆర్‌అండ్‌బీ ఏఈ